ఉద్ధరింపు

[కథానిక]

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

సీత లేచిపోవటంతో నరసింహంగారి కుటుంబంమీద పిడుగు పడ్డట్టయింది. ఆయనా, ఆయనభార్య కామమ్మా, కొడుకు పావకాలరావూ అనేకరోజులపాటు పడ్డ ఆవేదన చూస్తే ఎవరికన్నా కడుపు తరుక్కుపోవలసిందే. తమకు మద్రాసుమహానగరంలో ఉన్న ప్రతిష్ఠ యావత్తూ మంటగలిసినట్టూ, ఇక నలుగురిలోనూ తల ఎత్తుకు తిరిగే అవకాశం తమకు లేనట్టూ వాళ్లు విలపించారు.

నిజానికి నరసింహంగారికి అటువంటి కీర్తి పట్టణంలో లేదు. అది ఆయనవాళ్ల కాయలో మాత్రమే ఉంది. ఆయన పదిహేనేళ్ళనుంచీ పట్నంలో ఉంటున్నాడు. ఆయనకు కార్పొరేషనులో చిన్న ఉద్యోగం. ఆయన కున్న ఆ ఒక్క కొడుకూ, కూతురూ పట్నం తప్ప మరొక జన్మస్థలం ఎరగరనే చెప్పాలి. పావకాలరావు పట్నంలోనే చదివి, చదువు పూర్తిచేసి, ఏదో కంపెనీలో ఎకౌంటెంటుగా ఉండి ఇప్పుడిప్పుడే నూరురూపాయలు తెచ్చుకుంటున్నాడు.

ఈ పదిహేనేళ్ళ కాలంలోనూ నరసింహంగారు స్వయంగా చాలామందిపరిచయం సంపాదించాడుగాని వారి కుటుంబానికి ఎక్కువ కుటుంబాలతో సాన్నిహిత్యం ఏర్పడలేదు. కామమ్మగారు అరవం బాగా మాట్లాడటం నేర్చుకున్నతరవాత చుట్టుపక్కల ఉండే అరవస్త్రీలతో కొంత స్నేహం చేసింది. ఇటు నరసింహం పరిచయస్థులుగాని, అటు కామమ్మస్నేహితురాళ్లుగాని వీరి కుటుంబ గౌరవంతాలూకు ఒడుదుడుకులనుగురించి విమర్శించేవాళ్లు కారు. కామమ్మగారు నరసింహంగారి భార్య కాదని అకస్మాత్తుగా తెలిసినా ముక్కుమీద వేలు వేసుకునే ఓపికా, తీరికా ఎవరికీ లేదు. నరసింహంగారు పెద్ద ఉద్యోగంలో ఉంటే, వేలకు వేలు సంపాయిస్తుంటే, ఆయనకుటుంబానికి మరింత పలుకుబడి ఉండేదేమో. కాని, ఎప్పుడన్నా పుష్కరానికొకసారి ఎవరన్నా చూడవచ్చినప్పుడు ఇంత కాఫీఅయినా నమ్మకంగా కాచిపోసే స్థితిలో లేని నరసింహంగారి సంసారంగురించి ఎవరు శ్రాఘిస్తారు!

పోతే, నరసింహంగారి కుటుంబంయొక్క యోగక్షేమాలను గురించి ఎప్పుడన్నా విచారించేవాళ్ళు ముగ్గురునలుగు రున్నారు. వాళ్లు తెలుగువాళ్లే. అందులో ఒకావిడ మొగుణ్ణీ, ఇద్దరు పిల్లల్నీ వొదిలేసి వచ్చి ఎవరో నాయుడుతో ఉండి, ఆ నాయుడిభార్యనని చెప్పుకుంటున్నది. ఆవిడ ఈకుటుంబానికి ఒక ఆప్తస్నేహితురాలు. ఎప్పుడన్నా ఆవిడ టాక్సీలో దిగి గంటా రెండుగంటలూ కూచుని, కామమ్మగారు ఏపని చేస్తుంటే ఆపనిలో చెయ్యి వేసి, అడిగి కాఫీ పెట్టించుకుని, కాఫీపొడుం లేకపోతే ఒక పావుటాను తన డబ్బుతో తెప్పించిపెట్టి, నూరురూపాయల్లో "ఆర్ట్—ఖరీదైన" చీరెలు ఎక్కడ దొరుకుతాయో చెప్పి తనదారిన తాను పొయ్యేది. ఆవిడ వచ్చి వెళ్లినతరవాత కామమ్మగారు చాలాసేపు ఆవిణ్ణి తలుచుకుని అసూయపడేది.

సీతతో హైస్కూల్లో చదివిన మరొక పిల్ల అక్క ఒకతె నరసింహంగారి కుటుంబానికి స్నేహితురాలు. ఈ అమ్మాయి డాన్సు చేస్తుంది. నెలకు ఒక డాన్సుప్రదర్శనం ఇస్తూఉంటుంది. పేటమీద ఈవిడ చాలా సంపాదించేటట్టు కనిపిస్తుంది. వాళ్లిల్లు లక్ష్మితో తులతూగుతూఉంటుంది. మనిషికూడా చాలా అందంగా ఉండటంచేత చాలామంది డబ్బున్నవాళ్ళుకూడా ఆమెను పెళ్ళాడతా మని ఒకప్పుడు వచ్చారు. కాని వాళ్ల నాన్న పడనివ్వలేదు. ఇప్పుడామెపెళ్ళిప్రస్తావన ఎవరూ చెయ్యరు. కాకపోయినా ఆమెకు తీరిక లేదు. ఎప్పుడూ ఊరుగాళ్లకు పోతూఉంటుంది. విప్పూరన్నా వెళ్లి ఒక డాన్సు చేసిందంటే పదిపదిహేనురోజుల దాకా అవ్వూరివాళ్లు ఆమెను పోనివ్వరుట. ఈ అమ్మాయి మొట్టమొదటిసారి నరసింహంగారింట అడుగుపెట్టడానికి కారణం సీతే అయినా, ఒక్క క్షణంలో కామమ్మగారు ఈమెతో ఎంత గాఢ స్నేహం చేసేసుకున్నదంటే, ఆతరువాత ఆమె కామమ్మగారి కోసమే వచ్చేది. ఈవిడకూడా కాఫీ అడిగిపుచ్చుకునేది.

దేశంలో నరసింహంగారికీ, కామమ్మగారికీ బంధువు లున్నమాట నిజమే. కాని వాళ్లందరితోనూ నరసింహంగారు ఏనాడో సంబంధాలు తెంచుకున్నాడు. సగం వాళ్లమీది ద్వేషంతోనే ఆయన ఉద్యోగంకోసం మద్రాసు వచ్చాడు. ఇప్పుడాయన కెవరూ ఉత్తరాలు రాయరు. ఆయన అంతకన్నా రాయడు. సీత

పెళ్లి నిశ్చయించి ఆయన చాలాకాలంనుంచీ ఆలోచిస్తున్నప్పటికీ అయినవాళ్లల్లో ఒక్కరికికూడా సహాయం చెయ్యాలని ఆయన ఒక కార్డుముక్క గీకిన పాపాన పోలేదు.

అందుచేత సీత లేచిపోవటంవల్ల తన కున్న వంశగౌరవం ఏదో పోయిందని నరసింహంగారుగాని, ఆయనకుటుంబంగాని అట్టే విచారించవలసిన అవసరం లేదు. అయినా వాళ్లు విచారించారంటే దానికి కారణం, వాళ్ల అలవాట్లన్నీ పట్టణవాతావరణానికి అనుగుణంగా మారినప్పటికీ, మనఃప్రవృత్తులు—ముఖ్యంగా అవ్యక్త మనఃప్రవృత్తులు—ఇంకా పాతవాతావరణానికి అనుగుణంగానే ఉన్నాయి.

సీత లేచిపోవటానికి కారణాలు చాలా ఉన్నాయి. ఆమె స్కూలుఫైనలుదాకా చదువుకున్నది. చదువుకుంటున్నన్నాళ్లూ చదువులో నిమగ్నురాలై ఇతరవిషయాలు గమనించలేదు. కాని చదువు మానేసినప్పటినుంచీ ఆమె తన వాతావరణంమీద తిరగబడసాగింది. ఈ తిరుగుబాటంతా ఆమెహృదయంలోనే జరగటంవల్ల ఎవరూ గమనించలేదు.

పదహారుపదిహేడేళ్ల వయసు వచ్చి, కొంత చదువుండి, పుస్తకాలు చదవటంలో అపారమైన ఆసక్తి గల పిల్లకు కొన్ని కోరికలు కలగడంలో వింత లేదు. పైగా పట్టణవాతావరణం మరికొన్ని ప్రేరణలుకూడా కలిగిస్తుంది. కాని ఈ కోరికలు ఫలించే అవకాశం లేదు. సీతకు జీవితంలో ఎంత ఆనందం ఉన్నదో తెలుసును. చిన్న చిన్న బస్తీలలోనూ, పల్లెటూళ్లలోనూ ఉండేవాళ్లు ఊహించలేని సుఖాలను సీత ప్రత్యక్షంగా చూస్తూవచ్చింది. మంచి చీరెలు కట్టుకుని, అందంగా తయారై పార్కులకూ, బీచికీ, సినిమాలకూ, పాటకచ్చేరీలకూ, పార్టీలకూ, ఎగ్జిబిషనులకూ వెళ్లే పిల్లల్ని తాను ఎరుగును. ఇంట్లో కూచుని రేడియో వినవచ్చు. స్నేహితురాళ్లతోనూ, వాళ్ల అన్నలతోనూ పిక్నికులకు వెళ్లవచ్చు. పెళ్లయితే మొగుడితోనే షికార్లు వెళ్లవచ్చు. కాబోయే భర్తను ముందుగా చూసుకుని, మాట్లాడి, అతనిమీద ఇష్టం కలిగించుకోవచ్చు. ఈపనులన్నీ చేసే వాళ్లను సీత ఎరుగును. కాని ఇవి తనకు అందుబాటులో లేవు. ఎందుకు అందుబాటులో లేవో సీత తెలుసుకోవటానికి ప్రయత్నించింది. తన అన్నా, తండ్రీ చెప్పిన కారణాలలో ఆమెకు నమ్మకం కలగలేదు.

తిరగటంవల్ల మనస్సుకు కలిగే ఆనందం పాపహేతువన్నట్టూ, తిరగటంవల్లనే పట్టణంలో ఆడవాళ్లు అవినీతిపాలవుతున్నట్టూ వాళ్లు మాట్లాడారు. సీత ఈమాట నమ్మలేకపోగా ఆగ్రహంకూడా తెచ్చుకున్నది. తాను ఎరిగిన స్నేహితురాళ్లు అవినీతిపరులా? అవినీతిపరులైన ఆడవాళ్లను తమ ఇంట్లో కాఫీ ఎందుకు పోస్తున్నారు? వాళ్లను దూరంగా ఉంచరేం?

మగవాళ్లు ప్రతిదానికీ డబ్బులేకపోవటం ఒక అభ్యంతరంగా చెప్పేవాళ్లు. అరమైలు దూరంలో ఉన్న పార్కుకు రోజూ నడిచి షికారువెళ్లటానికి డబ్బెందుకూ? ఏడాదికొకసారి మంచి సినిమా చూడటానికి డబ్బు లేకుండా ఉందా? నెలకొక పుస్తకం కొనటానికి డబ్బు లేదా?

తన ఇంట్లో ఉన్న వాతావరణంమీద సీత తిరగబడింది. వాళ్లకి జీవించటం చాతకాదని ఆమె నిర్ణయించుకున్నది. డబ్బు ఇబ్బందులు ఉండవచ్చుకాక, తన తండ్రీ, అన్నా చూపించే సంస్కారానికి దారిద్ర్యంతో ఏమీ సంబంధం లేదని నిశ్చయించుకున్నది.

సీతతిరుగుబాటులో రెండో దశ ఒక పత్రికతో ఆరంభమయింది. తన స్నేహితురాళ్ల దగ్గిర తీసుకుని పత్రికలు అధికంగా చదివేది సీత. ఒక పత్రికలో ఆమె ఒక కథ చదివింది. అది రాసినతని పేరు రామదాసు. ఆకథ చదివేటప్పుడు ఆమెకు రామదాసు తనతో మాట్లాడుతున్నట్టే, అందులో ప్రతిమాటా తనకు అర్థం కావటానికి రాసినట్టే తోచింది. సీత ఎన్నో కథలు చదివిందిగాని ఇటువంటి భావం ఆమెకు ఎన్నడూ కలగలేదు. పైగా ఆ కథలో కథానాయిక తనవంటిదిగానే తోచింది. కనీసం ఆమెసంస్కారం ఆమెపరిసరవాతావరణంకన్నా ఉన్నతంగా ఉంటుంది. ఆమెకన్నా సంస్కారంలో హీనులైనవారు ఆమెజీవితాన్ని నిర్ణయిస్తారు.

ఈ కథ చదివినతరవాత చాలారోజులు సీత ఇంకొకవిషయం గురించి ఆలోచించలేకపోయింది. ఆఖరుకు కవరు సంపాదించి రామదాసుకు పత్రికపేర లేఖ రాసింది. అందులో ఆమె ఏమీ విశేషంగా రాయలేదు. ఫలానిపత్రికలో ఫలానికథ చదివాననీ, అది తన కెంతో బాగున్నదనీ రెండుముక్కలు రాసింది. ఆమె తలలో ఎన్నో పేజీలు నింపే ఆలోచన ఉన్నట్టు తోచిందిగాని అవి మాటలలో ఇమడలేదు. ఈఉత్తరం పోస్టులో వేసినతరవాత ఆమె కేదో భయం పట్టుకున్నది—ఆరామదాసు తననుగురించి ఎటువంటి అపోహలు పడుతాడో, ఎవరికైనా తనను ఎరిగినవాళ్లకు చూపిస్తాడేమో, తననుగురించి చులకనగా ఎవరితోనన్నా మాట్లాడుతాడేమో అని. ఉత్తరంలో తన ఎడ్రసు ఇవ్వలేదుకనక అతను సమాధానం రాస్తాడనే భయం లేదు. అది ఎవరికంటనన్నా పడుతుందనే భయమూ లేదు.

ఆసంఘటన అంతటితో అయిపోవలసిందే. కాని మరొక రెండునెల్లకు ఒక స్నేహితురాలి ఇంట సీతకు ఈ రామదాసే తటస్థపడ్డాడు! అతను పాతికేళ్లలోపువాడు. ఇంజనీరింగుకాలేజీలో చదువుతున్నాడు. అధికంగా అతను సీతస్నేహితురాలి అన్నను తెలుసును.

అతనే రామదాసనీ, తను ఆనందించిన కథ రాసినవాడనీ తెలియగానే సీత తెల్లబోయింది. కాని అతను తనపేరు విని ఏమీ కాలేదు. ఆమెకేసి విచిత్రంగాకూడా చూడలేదు. తను రాసిన ఉత్తరం అతనికి చేరినట్టు లేదు. ఇంకెవరిచేతిలో పడిందో!

రామదాసుకథ సీతకు నచ్చటంలో ఆశ్చర్యం లేదు. అతని మాటల ధోరణే సీతకు నచ్చింది. జీవితంపట్ల అతనికి వస్తుతహా కొంత అసహనం ఉన్నది. దాన్ని అతను తన మాటల్లోనే తెలియజేశాడు.

"జీవితం బాగా లేదని ఎవరన్నా నసపెట్టవచ్చు. కాని దాన్ని మార్చటానికి ఎవరు ప్రయత్నిస్తున్నారు? అటువంటి ప్రయత్నం ధనికులుమాత్రమే చెయ్యగలుగుతున్నారు. అందుకనే ఈ జీవితంలో దరిద్రులకూ, పనులుచేసుకునేవారికీ స్థానం లేదు. జీవితాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవటానికి ధనికులు చేసే ప్రయత్నాలను అడ్డగించేవారు లేరు. అటువంటిప్రయత్నమే బీదవాళ్లు చేస్తే వాళ్లకోసం లాటీలూ, తుపాకులూ, జైళ్లూ సిద్ధంగా ఉన్నాయి. ఈపరిస్థితి మారదు. కొందరు పేదలు చావటానికి సిద్ధపడి సరిఅయిన కృషి చేస్తేగాని మారదు. సోషలిజ మన్నమాట విన్నా, కమ్యూనిజ మనే మాట విన్నా హరిహరీ అని చెవులు మూసుకునే మనం జీవితాన్ని ఏవిధంగా మార్చాలోకూడా తెలీని స్థితిలో ఉన్నాం. ఇక మనం మార్చే దేమిటి?" అని అత నన్నాడు.

చాలాసేపు వాదన జరిగింది. రామదాసు మాట్లాడుతున్నంతసేపూ సీతకు తానే మాట్లాడుతున్నట్టున్నది. అతను చెప్పే విషయాలు తనకు తెలుసునని కాదు. అతన్ని ఖండించేవాళ్లకు అతనికి తెలిసినవిషయాలు తెలీవు. అతని కున్న జ్ఞానం లేదు. తన ఇంట్లో తన స్థితి ఎట్లా ఉన్నదో, ఈసమాజంలో రామదాసుస్థితి అట్లాగే ఉన్నది. అతను ఎదిరించి పోట్లాడుతున్నాడు; తను ఎన్నడూ పోట్లాడలేదు. అంతే భేదం.

అక్కణ్ణుంచి బయలుదేరేటప్పుడు సీత ఎక్కిన బస్సులోనే రామదాసుకూడా ఎక్కాడు. టిక్కెట్టు కొనబోతూ "మీ రెందాకా?" అన్నాడు. వద్దంటున్నకొద్దీ తనకూడా టిక్కెట్టు కొన్నాడు. మర్యాదకు ఏదన్నా మాట్లాడా లనుకున్నదిగాని ఏం మాట్లాడాలో సీతకు తెలియలేదు. అతను పార్కుదగ్గిర దిగిపోతూ, "కాస్సేపు పార్కులో కూర్చుందాం, రాకూడదూ?" అన్నాడు. సీత కొంచెం సంకోచించి అతనివెంట దిగింది. "ఈమనిషితో—పరాయివాడితో—పబ్లిగ్గా పార్కులో కూర్చుంటావా?" అని ప్రపంచం తనను ప్రశ్నించినట్టు ఊహించి సీత ప్రపంచంమీద మండిపడింది "ఏమిటి తప్పు? దురుద్దేశం కలదాన్నయితే అందరూ చేరేచోట పరాయిమనిషితో కూర్చుంటానా?" అని ప్రపంచానికి సమాధానం చెప్పింది.

ఇద్దరూ వెళ్లి ఖాళీగా ఉన్న పార్కుబెంచిమీద కొంచెం ఎడంఎడంగా కూర్చున్నారు.

"మీ ఉత్తరం అందింది. సమాధానం రాయాలంటే ఎడ్రసు తెలీలేదు" అన్నాడు రామదాసు.

సీతగుండె ఒక్కసారిగా ఆగిపోయింది.

వాళ్లిద్దరి స్నేహానికి అదే మొదలు. అది చాలా రోజులు గురుశిష్యసంబంధంగా ఉండేది. రోజూ ఆ పార్కులోనే ఇద్దరూ కలుసుకునేవాళ్లు. ఒక్కొక్కసారి అతనివెంట స్నేహితు లుండేవాళ్లు. ఎప్పుడన్నా సీతవెంటకూడా స్నేహితురాళ్లూ, ఎరిగినవాళ్లూ ఉండేవాళ్లు. రామదాసు సాధారణంగా సంఘంగురించీ, ఆర్థికశక్తులనుగురించీ, సాంఘికపరిణామంగురించీ, సోషలిస్టువ్యవస్థనుగురించీ మాట్లాడేవాడు. ఆదిమసమాజం ఎట్లా మారుతూవచ్చిందీ చెప్పేవాడు. అతను చెప్పే విషయాలు ఎంత విడ్డూరంగా ఉన్నా నిజమల్లే తోచేవి.

"అవునుగాని, ఇవన్నీ మీ రెక్కడ చదువుతారు? వీటిని గురించి పుస్తకా లున్నాయా? ఉంటే నా కివ్వగలరా?" అన్నది సీత.

ఆతరవాత రామదాసు ఆమెకు డజనుకొద్దీ పుస్తకాలు ఎక్కడినుంచో, ఎవరెవరివో తెచ్చి ఇవ్వసాగాడు. ఈపుస్తకాల మాదిరిగా సీతమానసికచైతన్యానికి మేత దొరికింది. ఇవాళ ఉన్న కులాలూ, కులతత్వాలూ, కులాచారాలూ ఒకనాడు లేవనీ, కొంత కాలానికి పోవచ్చుననీ తెలుసుకున్నప్పుడు సీతఆశ్చర్యానికి మేర లేదు.

సీతను ప్రణయంలోకి దింపినవాడుకూడా రామదాసే. అతను సీత ప్రేమను ఆశించనుకూడా లేదు. ప్రస్తుతసమాజంలో స్త్రీపురుషులు ఒకరినొకరు అర్థం చేసుకోవటంగాని, అభిమానించి ప్రేమించుకోవటంగాని ఎంత ప్రమాదకరమో చెప్పాడు.

అతను తనమీది ప్రేమతో ఎంత బాధ పడుతున్నదీ అతని నోటనే చెప్పించింది సీత.

"నీకు ఒకమనిషిమీద ప్రేమ ఉన్నట్టు బయటపెట్టడం కూడా ఈదిక్కుమాలిన కాలంలో అశ్లీలమే. పెళ్లిళ్లకు ఇన్ని హద్దులు ఏసమాజంలోనూ లేవు." అన్నాడు రామదాసు.

తనకూ, రామదాసుకూ కులభేదం ఉన్నదని సీతకు ఆదివరకే తెలుసు.

"వెనకటికన్న ఇప్పుడు పెళ్లిళ్లు నయం కాదా?" అన్నది సీత.

"ఏం మారిందని? కొందరు డబ్బున్నవాళ్లు సాహసించగలుగుతున్నారు. మిగిలినవాళ్లు సంస్కారవివాహాలు చేసుకోలేరు."

"మనిద్దరం పెళ్లి చేసుకుని చూద్దాం, ఏం జరుగుతుందో!"

"ఏం జరుగుతుందో ముందుగా తెలుసుకోలేమా? నేను మీ కులం కానందు కెవరూ అభ్యంతరం చెప్పరు—కనీసం వాళ్లకు ఆ అభ్యంతరంకంటే నేను ధనవంతుణ్ణి కానందునే అభ్యంతరం జాస్తిగా ఉంటుంది" అన్నా డతను.

సీత రామదాసును పెళ్ళిచేసుకుందా మనుకున్నది. ఈవిషయం తన తండ్రితోనూ, అన్నతోనూ, తల్లితోనూ మాట్లాడదా మను

ఉన్నది. కాని మామూలువిషయాలలోనే మధ్యయుగం మనుష్యులల్లే ప్రవర్తించేవాళ్ళతో ఈపెళ్లివిషయమై వితర్కించ బుద్ధిపుట్టలేదు.

ఆమెకు మొదట్లో లేచిపోదామన్న సంకల్పం లేదు. కాని చదువు పూర్తిఅయి రామదాసు పట్నం వదిలిపోతున్నా డనేసరికి ఆమెకు ఏదో చెయ్యాలనిపించే ఆవేశం కలిగింది. చాటుగా పెళ్ళిచేసుకోవటాని కామె మేజరు కాదు.

రామదాసు ఆఖరుసారి ఆమెను పార్కులో కలుసుకుని సెలవు పుచ్చుకున్నాడు.

"ఆడవాళ్లమీద నా కున్న గౌరవం ఎక్కువయేటట్టు చేశావు. అందుకని నిన్నెప్పుడూ మరిచిపోను" అన్నాడు రామదాసు.

అతను మర్నాడు మెయిలుకు వెళ్లిపోతున్నాడు. ఆరోజు సాయంకాలం సీత అర్ధరూపాయిడబ్బులు చేత పుచ్చుకుని పార్కుదగ్గిరికి మామూలుప్రకారమే వచ్చింది. సెంట్రలుస్టేషనువేపు వెళ్లే బస్సులో ఎక్కి స్టేషనుకు టిక్కెట్టు కొన్నది.

రైలు బయలుదేరటాని కింకా పదిహేనునిమిషా లున్నది. ప్లాట్‌ఫారంటిక్కెట్టు కొని మెయిలుపెట్టెలు వెతకసాగింది. రామదాసు మూడోతరగతిపెట్టెలో ఒకమూల కూర్చుని ఏదో ధ్యానం చేస్తున్నాడు. సీతను చూసి కంగారుగా బయటికి వచ్చాడు.

"నన్నుకూడా తీసుకువెళ్లండి—అభ్యంతరం లేకపోతే" అన్నది సీత.

రామదాసు సంకోచించాడు.

"మీ కభ్యంతరమైతే ఇంటికి వెళ్లిపోతాను."

"నాగురించి ఏమీ అభ్యంతరం లేదు. నువ్వు?"

"ఆలోచించుకునే వచ్చాను... నే నాఇంట్లో ఉండలేను. నరకం."

"టైము లేదు. టిక్కెట్టు కొనుక్కొస్తా నుండు."

రైలు సాగినతరవాత రామదాసు సీతకు తన పరిస్థితి చెప్పాడు.

"నువ్వు మాఇంటికి రావచ్చు. మాఇంట్లోకూడా మీమాదిరిగానే శాకాహారం తింటాం. కాని మావాళ్లను నువ్వు భరించలేవు. వాళ్లు కొద్దిగా చదువుకున్నవాళ్లు. నాజూకు ఎరగని మోటువాళ్లు. పల్లెటూరు కూడాను."

"ఫరవాలేదు. నాకోసం మీరేమీ ఇబ్బందిపడక్కర్లేదు. మీకూ మీవాళ్లకూ మధ్య భేదాలు పెట్టాలనే ఉద్దేశం నాకెన్నడూ లేదు. మీవాళ్ల జీవితం యథార్థమైన జీవితమని నా నమ్మకం. అందుచేత భరించగలుగుతాను" అన్నది.

"నన్నుకూడా తీసుకువెళ్లండి—అభ్యంతరం లేకపోతే" అన్నది సీత.

సీతమాట ఎట్లా ఉన్నా, ఆమెను చూసి రామదాసుతల్లిదండ్రులు చాలా సంతోషించారు. ఆమె తన స్నేహితురాలని అతను వాళ్లతో చెప్పాడు. "ఆమె ఏకులం? మన ఇంట్లో ఉంటుందా? మనను చూసి అసహ్యించుకోదా?" ఈవిధంగా రామదాసును ప్రశ్నించారు. వాళ్లు ఆమెకోసం కొన్ని తెచ్చిపెట్టబోవటానికి ప్రయత్నించారుగాని రామదాసు నిరుత్సాహపరిచాడు.

సీత అన్నది నిజమయింది. రామదాసుచుట్టాలు కపటంలేనివాళ్లు; సహజమైన భావాలు గలవాళ్లు; ప్రయోజనకరమైన వ్యాపకాలున్నవాళ్లు. ఇంటిమీదా, పనిమీదా వాళ్లకున్న శ్రద్ధ అపారం.

రామదాసు పేదవాడు కాదు. పెద్ద భాగ్యవంతుడు కాకపోయినా అతనికి చాలా పలుకుబడి ఉన్నది. ఈ వ్యవసాయం చేసుకునే వాళ్లలో మర్యాదలకు లోటు లేదు కాని కపటవినయాలు లేవు. సీతకు ఇప్పుడు సరిగా గాలి పీలుస్తున్నట్టుంది.

సీత భగాణిపోట ఉన్నదని కనిపెట్టటానికి నరసింహంగారికి వారంరోజులు పట్టింది. వెంటనే ఆయనా, పానకాలరావూ బయలుదేరి వచ్చారు. రామదాసు ఇంట్లో లేడు. అతనూ, సీతా సాయంకాలం పూట పొలాల్లోకి వెళ్లారు.

చెరువుదగ్గిర వాగ్యుద్ధం సాగింది. మొదట్లో రామదాసు మాట్లాడాడు. తరవాత సీతకూడా మాట్లాడింది. తండ్రీకొడుకులు వాదనలు వినదలచలేదు. సీతను తమవెంట పంపకపోతే పోలీసులకు రిపోర్టిస్తామన్నారు.

"మీకు నామీద గల ప్రేమ చూస్తే కడుపు నిండిపోయింది. కాని మీవెంట వస్తే నాకేం చేస్తారు? నా కిష్టంలేని మనిషి నిచ్చి పెళ్లి చేస్తారా? లేకపోతే మీ వంశగౌరవం దక్కించుకునేటందుకు నన్ను యావజ్జీవనరకంలో ఊరేస్తారా? నేను కులం చెడ్డాననీ, బజారుదాన్నయినాననీ ఇప్పుడే అంటున్నారుగదా, చూస్తూ చూస్తూ పరువుగలవాడికెట్లా ఇచ్చి చేస్తారు?" అన్నది సీత.

"నీ తెలివితేటలు చూసి సంతోషించటానికి రాలేదు. నువ్వు వెంటనే బయలుదేరి వస్తావా? కేసు పెట్టమన్నావా?" అన్నాడు పానకాలరావు.

"ఏమని కేసు పెడతారు?" అన్నది సీత రామదాసుతో.

"నువ్వు మైనరువు. కేసు పెట్టవచ్చు"

"ఎప్పటికి మేజరు నవుతాను?"

"పద్ధెనిమిదేళ్లకు."

"ఇంకో ఏడాదికా?... మళ్లీ వస్తాను. చెప్పకుండా వెళ్లానని మీవాళ్లనుకుంటారేమో, తొందరగా బయలుదేరానని చెప్పండి," అని, సీత తనవాళ్లతో బయలుదేరింది.

సీతను తిరిగి తీసుకొచ్చిన తరవాత ఇంట్లో అందరూ కుక్కను చూసినట్టు చూశారు. సీత అభ్యంతరం చెప్పలేదు. ఆమె రామదాసును పూర్తిగా మరిచిపోయినట్టు కనపడింది. కాలక్రమాన వాళ్లు కూడా మరిచిపోయినారు.

ఆరునెల్లు గడిచింది. సీతకు సంబంధాలు విచారించసాగారు. తనకు పెళ్లి అక్కర్లేదన్నందుకు పానకాలరావు, "అవును, రంకు సాగితే పెళ్లెందుకు?" అన్నాడు.

"అకస్మాత్తుగా సీత బయటికి బయలుదేరింది.
"ఎక్కడికే?" అన్నది తల్లి."

సీత నవ్వి, "నీ నిజమైన సంస్కారం చూపించటానికి ఎంత మంచి అవకాశా లిస్తున్నాను!" అన్నది.

సంవత్సరం అయింది. ఒకనాడు అకస్మాత్తుగా సీత బయటికి బయలుదేరింది.

"ఎక్కడికే?" అన్నది తల్లి. ఇంట్లో ఇంకెవరూ లేరు.

"వెళ్లానని చెప్పు. చెప్పకుండా వెళ్లినందుకు నాన్ననూ, అన్నయ్యనూ ఏమీ అనుకోవద్దను. అయినా వాళ్లు నాకు తగిన మర్యాద చూపించలేకపోయినారు. అందుచేత వాళ్లకు చెప్పనవసరం లేదు" అంటూ సీత బయటికి వచ్చింది.

తల్లి కేక వేస్తూ బయటికి వచ్చింది. కాని ఆవిడమొర ఎవరాలకిస్తారు? రోడ్డువెంట పోయే బస్సుల రొదలో ఆవిడకేక లెవరూ వినిపించుకోలేదు.

సీత పార్కు దగ్గిరికి వచ్చింది. అక్కడ ఆమెకోసం రామదాసు కనిపెట్టుకుని ఉన్నాడు.